'పోయిన చేద' మనస్తత్వాలు:

# వసపిట్టలు

అవసరాల రామకృష్ణారావు

మాటామాటా వచ్చి మూడురోజులు పట్టుదలగా కామేశ్వరీ మొగుడూ మాటలు మానేశారు. "తెగవాగేవారు మితభాషులముందు ఎప్పుడూ పరాజితులే. నాలుగు రోజులపాటు ఊరుకుంటే అన్నీ కుదురుతాయి. లేకపోతే అంత అహంకారం ఏమిటీ ఆ మనిషికీ?" అనుకుంది కామేశ్వరి. "అవసరమైనదీ కానిదీ అతిగా మాట్లాడి అన్యాయంగా లోకువ అయిపోయాను. మొహంచాటేస్తే మోహం పెరగడం ఎంతవారికైనా సహజం" అని మనసుకి జవాబు చెప్పుకున్నాడు గోపాలం. అతను చేసే లెక్చరరుపనికి తీరిక బాగా ఎక్కువ. శనాదివారాలు, మధ్యమధ్య శెలవలు, యివికాక లీజర్సులో ఒకటర్న్ సైకిలుమీద యింటికి వచ్చేసేవాడు. మంచి తెలివితేటలూ పనిలో సుళువులూ తెలిసిన మనిషేమో కామేశ్వరికూడా మొగుడు వెళ్ళిన అరగంటలో అంతా తెముల్చుకుని వంటింటికి తాళంవేసుకుని వాలుజడ అల్లుకుంటూ హాల్లోకూర్చొనేది. స్వభావరీత్యా యిద్దరికీ అట్టే మంది స్నేహితుల్ని పోగుచేసుకునే అలవాటులేదు. మరేంతోస్తుందీ? ఏ సినిమా గురించో, కథగురించో, తెలిసిన బంధువుల గుణగణాల గురించో వాదిస్తూ కాలం గడిపేవారు. అలాంటిది ఒక్కసారిగా బ్రేక్ పడిపోయింది. ఆ ఆలుమగల తగవు అద్దంమీద ఆవగింజా కాదు, గరికచివరని నీటిబిందువా కాదు. మూడురోజుల పాటు మఠంవేసుకు కూర్చుంది. అవీ శెలవలు అవడం, క్షణం గడవడం గగనమైపోయింది. ఆ నాలుగోరోజు అనుకుంటూ గోపాలం అల మారాతలుపు తీసి అందులోఉన్న ఆరెంజ్ కలర్ స్వెటర్ చూసి ఆశ్చర్యపోయాడు. అకస్మాత్తుగా "ఇది ఎవరికో!" అన్నాడు. "తొడుక్కుచూస్తే తెలుస్తుంది" అని లోపల్నుంచి జవాబు వచ్చింది. తొడుక్కుని అద్దంచూసుకుంటే అతనికిచాలా సరదావేసింది. లోపలికివెళ్ళి "నాకు సరిగ్గా సరిపోయింది. ఇది ఎప్పుడు తెప్పించావ్, ఎంతా?" అని అడక్కుండా ఉండలేకపోయాడు. "నేనే అల్లేను" అంది నెమ్మదిగా కామేశ్వరి.

"అదెప్పుడూ?" అన్నాడు ఆశ్చర్యంగా గోపాలం.

"నిన్నా, మొన్నా. మరి బాబుగారికి అలక వచ్చిందిగా! నాకేంతోచింది కాదు. అన్నపూర్ణమ్మ గారికి వచ్చునని తెలిసి వెళ్ళి నేర్చుకువచ్చాను. పట్టుపట్టాలిగాని ఎంతసేపూ" అంది తలవంచుకుని.

"ఇకచాలు అలకలు. తలఎత్తవచ్చు" అని గోపాలం ఆమె తలఎత్తి ఒక్కముద్దు పెట్టుకున్నాడు. "ఎంతబాగుంది మీకీ స్వెటరూ! సరిపోతుందో లేదో అని హడలిపోయాను. అవును గాని నిన్నా మొన్నా ఏమిటి ఒక్కబిగిని అలా రాసుకుంటున్నారూ?" అని అడిగింది కామేశ్వరి.

"క్షణంగడిచింది కాదు. ఏంతోచకపోతేనూ, ఫ్రెండ్సందరికీ లెటర్సురాసి పడేశాను. ఇప్పటికే ఇక మె మెందుకూ? అని దుమ్మెత్తిపోస్తున్నారు. అవునుగాని ఈ పేంట్ మీద పేరెవరుకుట్టేరూ?"

"నేనే, నిన్న మీ బట్టలన్నీ తీసి పేర్లు కుట్టి జాగ్రత్తగా సర్దేను. ఎప్పట్నుంచో అనుకుంటున్నాను ఇలా చేద్దామని-నిన్న కుదిరింది. ఉండండి వస్తాను" కామేశ్వరి లోపలికి వెళ్ళి రెండు ప్లేట్లతో గులాబ్ జామ్ తెచ్చి అక్కడ పెట్టింది. గోపాలం ఒక్కముక్క కొరికి "హాయ్‌హాయ్ నువ్వు ఇంత బాగా చేస్తావనీ ఇదివరకు ఎరగనే!" అన్నాడు. "దానికి కారణం చెప్తాను వినండి. ఇదివరకు మనం ఉత్తి కబుర్లతో కాలం గడిపేసే వాళ్ళం. అది ఎంత విలువైందో ఇప్పుడు అర్థమయింది. నేను చేద్దాం, చేద్దాం అని ఏడాది నుంచీ వెనకబెట్టిన పనులన్నీ యీ మూడు రోజుల్లోనూ ఫినిష్ అయిపోయాయి" అంది కామే

శ్వరి. "ఇంకేం? ఇదే బాగుంది! నిన్న సాయంత్రం ఏమీతోచక సెపంవేస్తున్న మన బంధువులందర్నీ ఒకసారి చూసి వచ్చేశాను. రాగానే రెండు "షార్టు స్టోరీస్" రాసి పడుకున్నాను. మాటలు మానెయ్యడం మనిద్దరికీ ఎంతో బాధాకరంగా ఉంది. ఈ ట్రాజెడీకి యింత హేపీ ఎండింగ్ ఉందని ఎవరనుకున్నారూ?" అని ముగించాడు గోపాలం.

* * *

డబ్బు అంటూఉంటే ప్రణాలికలు తయారు చేసుకోడం, పద్దులు రాసుకుని ఆ ప్రకారం ఖర్చు పెట్టడం గరగవచ్చు. కాని కొద్దిగా డబ్బు సంపాదించే ఎక్కువమందికి యీ అంచనాలు అందుబాటులోనికి రావు. కాని అందరూ పుష్కలంగా, ఇష్టం వచ్చినట్లు వాడుకోడానికి వీలైంది ఒకటుంది. ఏమిటదీ? కాలం. కాని ఊరికే ఏది వచ్చినా శంకించడం మన కలవాటు. రొంపా, దగ్గూ వస్తే రెండు హోమోపతి మాత్రలు యిస్తే మనకు రుచించవు. "వీడు ఊరికే ఎందుకిస్తున్నాడూ? ఇందులో ఏదో ఒకటి ఉండి ఉంటుంది" అని మన మనస్సు అన్వేషణలు ప్రారంభిస్తుంది. ఇంజక్షన్ల బాధా, అయిదురూపాయల ఖర్చూ అవుతేగాని మనకి తృప్తి ఉండదు. ఊరికే చదువు చెపుతామంటే పదిమంది పోగవడము బ్రహ్మాండం. ఉచితంగా ఏదివచ్చినా మనం కట్టే విలువ అంతే. అందుకనే కాలాన్ని అంత చవకగా, మంచినీళ్ళ ప్రాయంగా వాడుకొంటున్నాం. "కాలాన్ని దుర్వ్యయంచేసే ఇతర మార్గాలులేవా?" అని అడగవచ్చు. ఉన్నాయి. కాని అందరం ఎక్కువగా కాలాన్ని ఖర్చుచేసే విధం విలువచెయ్యని కబుర్లతోనే.

* * *

"అరగంటసేపు నలుగురు ఆడవాళ్లు మాట్లాడుకుంటే ఎంత 'ఎనర్జీ' పుడుతుందీ?" అని అడుగుతే "ఏం? ఆ 'హీట్'తో నిక్షేపంలా అరకప్పు కాఫీ కాచుకు తాగొచ్చు" అని అంచనా కట్టేడుట ఒక బుద్ధిమంతుడు. ఎక్కువగా మాట్లాడడంలో దేశదేశాల్లో స్త్రీలు ప్రఖ్యాతిగాంచేరు. అదో అలవాటు చేసుకుని బంధువులతో, పరిచయస్తులతో, ఆఖరికి పనివాళ్లతో ఆడవాళ్లు గంటల కొద్దీ అలా మాట్లాడుతూనే ఉంటారు. పక్కింట్లో ఏ రోజు ఏ కూర చేసుకున్నారో అన్న భోగట్టాదగ్గిర్నుంచి ఏ అమ్మాయికి ఎంత కట్నమిచ్చారో, ఎన్ని నగలు పెట్టారో, ఏ పెళ్లిలో ఎన్నెన్ని రకాల అల్లర్లు జరిగేయో (వీనుల విందుగా) యువతలవారికే కావాలి. ఈ "పోయినచేద" మన స్తత్వం మొగాళ్ళకీ యించుమించు సమానమే అనిపిస్తుంది. అవతలవారు వింటున్నారో, లేకపోతే వీళ్ళమ్మ వీళ్ళకి ఎంత వసపెట్టిందో అని విసుక్కుంటున్నారో ఆ ఆలోచన లేకుండా తమ అనుభవాలగురించీ, చిన్ననాటి ముచ్చట్లగురించీ ప్రస్తుతపు దేశ పరిస్థితులమీద తమ అభిప్రాయాలగురించీ శక్తివంచన లేకుండా కరువుదీరా అలా ఏకరువు పెడుతూనేవుంటారు మొగాళ్లు. ఈ విషయంలో స్త్రీ పురుషులు "దొందు" "దొందే" కాబట్టి పరస్పర విమర్శలు అన్యాయం.

* * *

రైళ్ళలోనూ, బస్సుల్లోనూ, ట్రాముల్లోనూ అలా అపరిచితులు కనిపిస్తూనే ఉంటారు. ఆ ప్రయాణంలో తప్ప సాధారణంగా వారు మనకి జీవితంలో కనిపించరు. కాని ఆ కొద్ది సేపట్లోనూ పక్కనున్న వ్యక్తి గురించి ముద్దినుసు వివరాలూ తెలుసుకుని వాడి దుంపతెంచడం మనలో చాలామందికి అలవాటు. "టైమెంతయింది?" అని మొదలుపెట్టి వాడు ఎందుకు పెళ్ళి చేసుకోలేదో ఆరాలు తియ్యకూడదు. ఇందులో మనకి వచ్చిందేంలేదుగాని అవతలవాడు ఆ జిడ్డు మొహాన్ని ఈ జీడిని ఎలా వదుల్చుకోడమా అని బాధపడేటట్టు చెయ్యకూడదు. అక్కర్లేని భోగట్టాలు సేకరించడంలో ఆనందం ఉందనడం అర్థంలేని మాట.

* * *

రోజులు గడుస్తున్నాయి. నెలలు నడుస్తున్నాయి. కేలండరు చిరుగుతోంది. కాలం గిర్రున తిరుగుతోంది. ఒక్కసారి జీవితంలో వెనక్కి తిరిగి చూసుకుంటే, ఇన్నాళ్లూ నేను చేసిందేమిటి?" అని ప్రశ్నించుకుంటే "ఉట్టికబుర్లే" అనిజవాబు వస్తేమాత్రం ప్రాణం చివుక్కుమంటుంది. ★